## క్లుప్తంగా

### చిరుధాన్యాలపై అవగాహన

**నెల్లూరు రూరల్:** కర్లాలమిట్టలోని మున్సిపల్ హైస్కూల్లో చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును డీకేడబ్ల్యూ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. చిరుధాన్యాల్లోని పోషక విలువలను వివరించారు. ప్రిన్సిపల్ గిరి, సైన్స్ హెచ్‌ఓడీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట



**తోటపల్లిగూడూరు:** పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోట్లపూడి, కొత్తపాళెం గ్రామాలకు చెందిన 134 మంది రైతులకు ఉచిత పశుదాణాను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే మిచాంగ్ తుఫాన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాడి రైతులకు ఉచితంగా పశుదాణామృతాన్ని పంపిణీ చేస్తోందని తెలిపారు. కోడూరు పశువైద్యశాల వైద్యులు నరేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

### ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలి



**పొదలకూరు :** గర్భిణులు ప్రతి నెలా 9వ తేదీన క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రిషిత సూచించారు. స్థానిక బిట్–1 సచివాలయంలో ప్రధానమంత్రి మాతృత్వవందన యోజనపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం తొలి కాన్పు అయితే రూ.5 వేలు అందజేస్తుందని తెలిపారు. గర్భం దాల్చిన తర్వాత రూ.1000, ఆరో నెలలో రూ.2 వేలు, శిశువు జన్మించిన తర్వాత రూ.2 వేలు వంతున అందజేస్తారని వివరించారు. రెండో కాన్పులో ఆడ శిశువుకు జన్మనిస్తే వ్యాక్సినేషన్ పూర్తయిన తర్వాత రూ.6 వేలు అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వ సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, సెక్రటరీ బాలకృష్ణయ్య, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, తదతరులు పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

**కోవూరు:** స్థానిక గాంధీపార్కు సెంటర్‌లోని కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మార్గశిర మాసం నవమిని పురస్కరించుకుని అర్చకులు శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయంలో పునర్నిర్మాణ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఉదయం సీతారాములకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సీడీసీ మాజీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఆలయ ఈఓ దగ్గయ్య, గాదిరాజు సుధాకర్, మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### దిగజారిన నిమ్మ ధరలు



**పొదలకూరు:** చలి ప్రభావంతో నిమ్మ కాయలు ధరలు మరింత దిగజారాయి. ప్రస్తుతం పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో కిలో రూ.15 నుంచి రూ.20 మాత్రమే ధర పలుకుతున్నాయి. ఉత్తర భారత దేశంలో చలితీవ్రత పెరగడం, అన్ని ప్రాంతాల నుంచి కాయలు ఎగుమతి అవుతుండడంతో నిమ్మ రైతులకు కష్ట కాలం ఏర్పడింది. దక్షిణ భారత దేశంలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం కాయలకు డిమాండ్ లేకుండాపోయింది. మండలంలో 9 వేల ఎకరాల్లో నిమ్మ తోటలు సాగుచేస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో వీచిన పెనుగాలులకు నిమ్మతోటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో తోటల్లో కాయలు ఆశించిన స్థాయిలో లేవు. కాయల దిగుబడి లేకున్నా మార్కెట్లో ధరలు పెరగడం లేదు. చిన్న, సన్నకారు రైతులైతే భార్య, భర్త కలసి సొంతంగా తోటల్లో కాయలను కోసుకుని మార్కెట్‌కు తీసుకుని వెళితే ఖర్చులుపోనూ రూ.100 నుంచి రూ.150 బస్తాకు మిగిలే అవకాశం ఉంది. కూలీలను ఏర్పాటు చేసి కాయలు కోయిస్తే ఆటోల బాడుగలు, కూలీల ఖర్చులు పోను ఏమీ మిగిలే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

# నగరాభివృద్ధే లక్ష్యం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



49వ డివిజన్లో పర్యటిస్తున్న అనిల్‌కుమార్

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** నగరాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 49, 50వ డివిజన్లలో గల ఈద్గామిట్ట, మెట్లరేవు, బొమ్మాకేశవులు వీధి తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను ఆరాతీసి వీటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి డివిజన్లో రోజూ పర్యటిస్తూ అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తున్నామని వివరించారు. బీఈడీ కళాశాల నుంచి మసీదు రోడ్డును స్థానికుల సహకారంతో వెడల్పు చేశామని పేర్కొన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కొందరు కనిపించరని విమర్శించారు. 49వ డివిజన్లో గతంలో వరదలొచ్చిన సమయంలో టీడీపీ నేత నారాయణ ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఎవరు ఉంటున్నారో ఆలోచించాలని కోరారు. కార్పొరేటర్లు వందవాసి రాజేశ్వరి, గుంజి జయలక్ష్మి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మండల పూజలు



**నెల్లూరు(బృందావనం):** నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలను విశేషంగా నిర్వహిస్తున్నారు. శీవేలి ఉత్సవం, ప్రత్యేక పూజలను శనివారం జరిపారు. ఉభయకర్తలుగా గండవరపు వెంకటరెడ్డి, పద్మ, రామానాయుడు, రేష్మ దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, శంకరన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో తనిఖీ



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

**నెల్లూరు(బారకాసు):** సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని 35 / 3 రాజీవ్‌గృహకల్ప, 41 / 1 మూలాపేట వార్డు సచివాలయాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్డీజీ, భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో ఎక్కువ మంది క్రీడాకారులు, వీక్షకులను భాగస్వాములను చేయాలని సూచించారు. కులగణన సర్వేలో భాగంగా సచివాలయ పరిధిలోని ప్రజల సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతి, ఆస్తి పన్నులు, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

## బాధితులకు అండగా ఉంటాం



సాయాన్ని అందజేస్తున్న రంగారెడ్డి

**నెల్లూరు రూరల్:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తుఫాన్ బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకుపల్లి, మాదరాజుగూడూరు, పెనుబర్తిలో బాధితులకు రూ.2500 నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు.

## విద్యార్థులకు టవళ్ల పంపిణీ



**నెల్లూరు రూరల్:** కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టవళ్లను వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఏరియా కోఆర్డినేటర్ గోపాల్ మాట్లాడారు. నగర శివారు ప్రాంతాల్లోని విద్యార్థుల అభ్యున్నతికి తమ సంస్థ పాటుపడుతోందని చెప్పారు. ఉపాధ్యాయురాలు రమణమ్మ, సంస్థ వలంటీర్ ఆంజనేయులు, కమ్యూనిటీ వర్కర్స్ రాజేశ్వరి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల వితరణ



**నెల్లూరు రూరల్:** తుఫాన్ కారణంగా ఇబ్బంది పడిన వావిలేటిపాడు గిరిజన కాలనీలోని 100 కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఏపీ ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ సహకారంతో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, మస్తానయ్య, ప్రభాకర్‌రెడ్డి, శివాజీ యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, ఫైనాన్స్ సంస్థ హెడ్ ఫణికుమార్, రీజినల్ మేనేజర్ రమేష్, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సురేష్‌బాబు

**నెల్లూరు రూరల్:** ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని గుర్రం జాషువా గ్రంథాలయంలో అసోసియేషన్ జిల్లా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మందా బాబ్జీ, ఉపాధ్యక్షులుగా కొమ్మల కృష్ణయ్య, శేషం ప్రభాకర్, రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా హరిబాబు, పాలకీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా జూపూడి ప్రశాంత్ నియమితులయ్యారు.

## విద్యుత్ భవన్ వద్ద ధర్నా రేపు



**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి గానూ నగరంలోని విద్యుత్ భవన్ వద్ద ధర్నాను సోమవారం చేపట్టనున్నామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్‌ఈ విజయన్‌కు నోటీస్‌ను శనివారం అందజేసిన అనంతరం సుమన్ మాట్లాడారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### జాతీయ పింఛనర్ల దినోత్సవం నేడు

**నెల్లూరు(బృందావనం):** భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ సంఘ భవనంలో జాతీయ పింఛనర్ల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 70 ఏళ్లు దాటిన పింఛనర్లను సత్కరించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

### ఘన స్వాగతం



**నెల్లూరు(బారకాసు):** జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్‌పై నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. సమావేశానికి హాజరయ్యేందుకు గానూ నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్‌కు కమిషనర్ వికాస్ మర్మత్ ఘన స్వాగతం పలికారు. తొలుత పూల మొక్కను అందజేసి అభినందనలను తెలియజేశారు.

### రాజమన్నార్‌గా రంగనాథుడు



**నెల్లూరు(బృందావనం):** పగల్‌పత్తు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు రాజమన్నార్‌గా శనివారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మొగిలి నంబెరుమాళ్‌శెట్టి, మొగిలి రాధాకృష్ణయ్యశెట్టి కుమారులు వ్యవహరించారు.

### శ్రీరామపట్టాభిషేక అలంకారంలో వేణుగోపాలుడు



**నెల్లూరు(బృందావనం):** మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు శ్రీరామ పట్టాభిషేక అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పేటేటి వెంకటసుదర్శన నిఖిలేష్ వ్యవహరించారు.

### గోదాదేవికి విశేష పూజలు



**నెల్లూరు రూరల్:** నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గల గోదాదేవి సన్నిధి వద్ద ధనుర్మాస దీపారాధన, విశేష పూజలను శనివారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు ఉచితంగా పశు దాణా

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



పశు దాణాను అందజేస్తున్న ఆనం అరుణమ్మ

**నెల్లూరు రూరల్:** తుఫాన్ కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పశు దాణాకు కొరత ఏర్పడిందని, ఈ క్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పాడి రైతులకు ఉచితంగా అందజేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని పశు వైద్యశాలలో పాడి రైతులకు టీఎమ్మార్ పశు దాణాను శనివారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడిందని చెప్పారు. చింతారెడ్డిపాళెం, సౌత్‌రాజుపాళెం ప్రాంతాల్లో రెండు మెట్రిక్ టన్నుల దాణాను పాడి రైతులకు అందజేశామని వివరించారు. పశుసంవర్థక శాఖ డీడీ నాగమణి, ఏడీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

**నాడు – నేడు పనుల పరిశీలన**

చింతారెడ్డిపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు.

## ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

**నెల్లూరు రూరల్:** ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ మహాసభల్లో శనివారం ఆయన మాట్లాడారు. ఫెలోషిప్‌లో కోత విధించడంతో పేద విద్యార్థులకు యూనివర్సిటీ విద్య దూరమవుతోందని చెప్పారు. అనంతరం అరుణోదయ కళాకారులు విప్లవ గీతాలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు, మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నేతలు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించరూ..



మంత్రికి వినతిపత్రమిస్తున్న నేతలు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** తమ సమస్యలను పరిష్కరించాలని ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రాన్ని నగరంలోని ఆయన నివాసంలో శనివారం అందజేశారు. వివిధ సమస్యలను మంత్రికి అసోసియేషన్ కన్వీనర్ సాయి విశ్వనాథ్ తెలియజేశారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## దివ్యాంగులకు దుప్పట్ల అందజేత



**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** పడారుపల్లిలోని దివ్యాంగుల కాలనీలో దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, క్రాంతి సేవా సంస్థ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా యునైటెడ్ సింహపురి క్యారల్స్





**నెల్లూరు(బృందావనం):** నగరంలో యునైటెడ్ సింహపురి క్యారల్స్‌ను శనివారం వేడుకగా నిర్వహించారు. ఏబీఎం కాంపౌండ్ వద్ద ఫాదర్ జోసఫ్, బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ పాస్టర్ రెవరెండ్ శ్యామ్‌సన్ కుమార్, బ్రదర్ బర్నబాస్, బ్రదర్ పాల్‌కోటి, రెవరెండ్ డాక్టర్ మణిరావ్, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ క్యాండిల్ వెలిగించి.. బెలూన్లను వదిలి క్యారల్స్‌ను ప్రారంభించారు. యేసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే భక్తిగీతాలను ఆలపిస్తూ ఏబీఎం కాంపౌండ్ నుంచి బట్వాడిపాళెం వరకు సాగింది. వీఆర్సీ సెంటర్ వద్ద భారీ కేక్‌ను కట్ చేశారు. గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ అరుణ్‌కుమార్, కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానిజో, కో కన్వీనర్లు విద్యాధర్, మహేష్, సాయి, ప్రముఖ న్యాయవాది శివరామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న నాగబాబు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** జిల్లాలో జనసేన బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొణిదెల నాగబాబు పేర్కొన్నారు. నగరంలోని రవీంద్రనాథ్ టాగూర్ భవన సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గ నేతలు, ముఖ్య కార్యకర్తలు తదితరులతో సమీక్షించారు. అనంతరం కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలతో సమీక్ష నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, నగర ఇన్‌చార్జి వేములపాటి అజయ్, చిరంజీవి యువత నేతలు ఏటూరి రవికుమార్, పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

**నెల్లూరు(బృందావనం):** గీతా జయంతి మహోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నాలుగు విభాగాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విశ్రాంత డీఆర్వో పెంచలరెడ్డి, స్వామి దయానంద సరస్వతి, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామినాయక్, దేవరాజులు, ధార్మిక సలహా మండలి జిల్లా సభ్యులు శ్రీహరి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, జయరామయ్య, వెంకటరమణయ్య, రవికుమార్, రఘు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## కనులపండువగా క్యారల్స్



**నెల్లూరు(క్రైమ్):** గౌతమినగర్‌లోని యునైటెడ్ క్రిస్టియన్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ క్యారల్స్‌ను వేడుకగా శనివారం నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ షారోన్ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని సంఘ సభ్యుల గృహాలను సందర్శించి క్రీస్తు జనన వృత్తాన్ని వివరించే భక్తిగీతాలను సంఘపెద్దలు, యువత ఆలపించారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. సంఘ అధ్యక్షుడు జయప్రసాద్, సెక్రటరీ విలియమ్ జోసఫ్, జాయింట్ సెక్రటరీ వినోద్‌కుమార్, సంఘ పెద్ద దేవదానం తదితరులు పాల్గొన్నారు.